క్లుప్తంగా

నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తాం



ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కమలాపురం : ఎన్నికల విషయంలో ఎవరైన గొడవలు సృష్టించినా, ఘర్షణలకు పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అనంతరం వాటి గురించి పంతాలకు పోయి ఘర్షణలకు పాల్పడినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. గొడవలకు దిగిన వారు ఎంతటి వారైన వారిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పెట్టి జైలుకు తరలిస్తామన్నారు. అలాగే వారిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేసి, గ్రామ బహిష్కరణ చేపడతామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైన సమస్యలుంటే మీరు గొడవలకు దిగవద్దని, పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

ఏపీఆర్జేసీలో విద్యార్థినికి ర్యాంకు



ర్యాంకు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్

సింహాద్రిపురం : ఏపీఆర్జేసీ ప్రవేశపరీక్ష ఫలితాల్లో సింహాద్రిపురం మండలంలోని వివేకానంద హైస్కూల్‌కు చెందిన హుమేరా అంజుమ్ 1872వ ర్యాంకు సాధించి కర్నూలు జిల్లాలోని బనవాసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఖాదర్‌వల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన విద్యార్థినికి ఏపీఆర్జేసీలో ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థిని అభినందించారు.

వైభవంగా గంగమ్మ జాతర



జమ్మలమడుగు : కన్నెలూరు గంగమ్మజాతర ఉత్సవాన్ని వైభవంగా గ్రామ పెద్దలు శుక్రవారం ప్రారంభించారు. ఈ గ్రామోత్సవం 19వ తేదీ ముగియనుందని గ్రామ పెద్దలు తెలిపారు. 70 సంవత్సరాల తర్వాత ఈ గ్రామోత్సవాన్ని నిర్వహిస్తుండటంతో కన్నెలూరు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. శనివారం అమ్మవారి తమ్ముళ్ల వేషధారణ పోతురాజులు గ్రామంలో తిరిగే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు పాలేటి యాగం, 8గంటల నుంచి అమ్మవారికి బోనాలు సమర్పణ కార్యక్రమం, సాయంత్రం ఆరు గంటలకు ఆవుల పందేరము, 7 గంటలకు అమ్మవారు బంగారు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు

యథావిధిగా ఆర్టీసీ బస్సు సర్వీసులు



రాణీవనం మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులు

యర్రగుంట్ల : పట్టణంలోని రాణీవనం మీదుగా రైల్వేస్టేషన్ నాలుగురోడ్ల కూడలి వరకు ఆర్టీసీ బస్సులు యాథావిధిగా తిరుగుతున్నాయని ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని ప్రొద్దుటూరు ఆర్టీసీ డీఎం మల్లిఖార్జున రెడ్డి తెలిపారు. రాణీవనంలోని ఎస్‌బీఐ నుంచి రైల్వే బ్రిడ్జి వరకు నూతనంగా సీసీరోడ్డు వేస్తుండటంతో కొన్ని రోజులు బైపాసు రోడ్డు మీదుగా బస్సు సర్వీసులు నడిపినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తి కావడంతో బస్సులను రాణీవనం మీదుగా నడుపుతున్నామన్నారు. అయితే రోడ్డుపై ఉన్న మట్టిని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సూచన మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మాడిశెట్టి శివ తొలగించారు.

ఘనంగా పూజలు

కడప కల్చరల్ : ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల ఉత్సవాలలో భాగంగా తొలిరోజు ఉదయం ఎంపిక చేసిన కన్యకలకు మంగళస్నానం ఆచరింపజేసి వాసవీ దీక్షను ప్రారంభించారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో దీక్షధారులతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

పులివెందులలో చీనీ మార్కెట్ రికార్డు

- 9 మాసాల్లో రూ.38 కోట్ల చీనీ కొనుగోళ్లు
- రైతులకు తగ్గిన రవాణా భారం
- సూట్ లేకపోవడంతో అన్నదాతలకు ఆదాయం



మార్కెట్‌లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న చీనీకాయలు



చీనీ మార్కెట్‌లో ఉన్న గ్రేడింగ్ మిషన్

పులివెందుల : పులివెందుల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీనీకాయల మండి (కొనుగోలు కేంద్రం) ద్వారా 9 మాసాల్లో 17,748 టన్నులకు రూ.38.82 కోట్ల చీనీకాయల కొనుగోలు జరపడం రాయలసీమలోనే రికార్డు కొనుగోళ్లుగా చెప్పవచ్చు. చీనీపండ్లతోటల సాగు అత్యధికంగా పులివెందుల నియోజకవర్గంలో 64 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో సాగుచేస్తున్నప్పటికీ సరైన మార్కెట్ సౌకర్యం లేక సరైన ధరలు లభించక రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

నెరవేరిన రైతుల కళ :
అన్నదాతలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటిని అధిగమించేలా చర్యలు చేపట్టాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. అందులో భాగంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పండ్ల తోటల రైతులతో సమావేశాలు నిర్వహించి చీనీకాయల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఓఎస్‌డీ అనంతపురం మార్కెట్ ట్రేడర్స్‌తో పలుదపాలుగా చర్చలు జరిపి చీనీకాయల మండిని పులివెందుల మార్కెట్లో గత ఏడాది సెప్టెంబర్ 10న ఏర్పాటు చేయించారు.

అనంతపురం మార్కెట్‌ను అధిగమించి :
అనతి కాలంలోనే అనంతపురం మార్కెట్‌ను అధిగమించి పులివెందుల చీనీకాయల మండి రికార్డు సృష్టించింది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు పులివెందుల మార్కెట్ నిర్వహించిన కొనుగోళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

సూట్ లేకపోవడం :
చీనీకాయల కొనుగోళ్లలో సూట్ లేకపోవడం, రైతులకు రవాణా ఖర్చులు కలిసి రావడం, పండ్ల కొనుగోలుకు విశాలమైన జంబో షెడ్లు కలిగి ఉండటం, ట్రేడర్స్, రైతులకు కావాల్సిన వసతులు కల్పించడం, గ్రేడింగ్ మిషన్ అందుబాటులో ఉండటం, తాగునీరు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, నిరంతర కాపలా, వాహనాలకు విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉండటంతో పులివెందుల చీనీ మార్కెట్ దూసుకుపోతోంది.

రైతులకు గిట్టుబాటు ధరలు ఇక్కడే :
పులివెందుల మార్కెట్లో చీనీకాయల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన తొమ్మిది మాసాల్లో గరిష్టంగా ధరలు రైతులకు ఇక్కడే లభిస్తుండటం ఊరట కలిగిస్తోంది. రవాణా పరంగా దూరం తగ్గడం, బహిరంగ వేలం నిర్వహించడం, సౌకర్యాలు కల్పించడంలోనూ పులివెందుల చీనీ మార్కెట్ తక్కువ కాలంలోనే రాయలసీమలోనే ప్రసిద్ధ మార్కెట్‌గా పేరుగాంచింది.



మార్కెట్‌లో కాటా వేస్తున్న చీనీకాయలు

నెల	వచ్చిన టన్నులు	విలువ కోట్లలో
సెప్టెంబర్ 2023	631	1.20
అక్టోబర్ 2023	2914	5.67
నవంబర్ 2023	961	2.22
డిసెంబర్ 2023	345	0.80
జనవరి 2024	584	1.08
ఫిబ్రవరి 2024	1746	2.67
మార్చి 2024	2595	4.43
ఏప్రిల్ 2024	5265	13.71
మే 2024	2702	7.03
మొత్తం	17,748	38.82

చీనీమార్కెట్ రైతులకు వరం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో పులివెందుల్లో చీనీ మార్కెట్ ఏర్పాటు కావడం రైతుల కు వరంగా మారింది. ఒకప్పుడు చీనీ మార్కెట్ అంటే అనంతపురం ఉండేది. నేడు పులివెందుల చీనీ మార్కెట్‌కు ప్రసిద్ధి చెందింది. బహిరంగ వేలంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తోంది. చీనీకాయల మండీని ఏర్పాటు చేసిన తొమ్మిది మాసాల్లోనే పులివెందుల మార్కెట్ ప్రసిద్ధి గాంచడం ఆనందంగా ఉంది.
– రామాంజనేయులు, వ్యవసాయ మార్కెట్ సంయుక్త సంచాలకులు

రైతులకు ఎంతో ప్రయోజనకరం :



వ్యవసాయ మార్కెట్‌లో చీనీరైతులు తాము పండించిన పంటను నేరుగా దళారి వ్యవస్థ లేకుండా అమ్ముకోవడం జరుగుతుంది. గతంలో దళారులు చీనీ రైతులను సూట్ పేరుతో మోసగించేవారు. అలాంటి వ్యవస్థకు స్వస్తి పలకాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు రైతుల కోసం సూట్ లేకుండా తమ చీనీకాయలను అమ్ముకునే విధంగా మార్కెట్ కమిటీలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీనివల్ల రైతులకు దళారి వ్యవస్థ బెడద తప్పి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. దీంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు.
– చిన్నప్ప, మార్కెట్‌యార్డు ఛైర్మన్, పులివెందుల.

దోమలు వ్యాప్తి చెందకుండా ఫ్రైడే–డ్రైడే పాటించాలి



నీటి నిల్వల వద్ద అబేట్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

పెండ్లిమర్రి : గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని నందిమండలం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నందిమండలం గ్రామంలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి దోమల వలన కలిగే నష్టాలగురించి ప్రజలకు వివరించారు. ప్రతి శుక్రవారం ఇళ్లల్లో ఉన్న నీటి తొట్లు, కుండలు, కూలర్లు, టైర్లు, టెంకాయ చిప్పలు వంటి వాటిల్లో మురికి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న మురికి నీటి నిల్వల వద్ద అబేట్ ద్రావణం పిచికారి చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ సబ్ యూనిట్ అధికారులు మురళీ, రామప్రతాప్, ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రనాథ్, సూపర్‌వైజర్లు వెంకటసుబ్బమ్మ, రేవతి పాల్గొన్నారు.

20న పాలేటి గంగమ్మ తిరునాల



పూజలందుకుంటున్న మంచాలమ్మ

కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్ల–గొల్లపల్లె గ్రామాల మధ్య వెలసిన శ్రీ పాలేటి గంగమ్మ(మంచాలమ్మ) తిరుణాల మహోత్సవాన్ని ఈనెల 20వ తేదీన వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మహా గణపతి పూజ, ప్రధాన కళశ స్థాపన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్నదానం నిర్వహిస్తున్నామని, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. అలాగే తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని పాలపళ్ల ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఎడ్ల యజమానులు ఆలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.

ప్రతి ఒక్కరు మానవత్వంతో సేవ చేయాలి



దర్గాలో పూలచాందిని సమర్పిస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : ప్రతి వ్యక్తి తన జీవితంలో మానవత్వం చూపుతూ ఇబ్బందుల్లో ఉన్నవారికి సేవతో పాటు సాయం చేయాలని ఆస్థానయే గొసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్ పీరాఖాద్రీ తెలిపారు. సయ్యద్‌షా బడే గౌస్‌పీరాఖాద్రీ 92 ఉరుసుమహోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ సమాజంలో అనేక రకాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటారని వారిపట్ల మానవత్వం చూపాలన్నారు. దేవుడి పట్ల విశ్వాసం కచ్చితంగా కలిగి ఉండాలని సూచించారు. అనంతరం 101 దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ ప్రొద్దుటూరు సబ్‌స్టేషన్, 33 కేవీ ఐడీఏ ఫీడర్, 33 కేవీ మార్కెట్ యార్డు ఫీడర్, 33 కేవీ ప్రొద్దుటూరు టౌన్ ఫీడర్, పలు 11 కేవీ ఫీడర్ల పరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ నిర్వహణ పనుల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగదు



మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాజకీయపరంగా ఎటువంటి గొడవలు, అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా వాటికి దూరంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నేత, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అదేవిధంగా సోషల్ మీడియాలో రెండు పార్టీల మధ్య రెచ్చగొట్టే పోస్టులు కానీ, వ్యాఖ్యలు కానీ చేయరాదని గుర్తు చేశారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి గొడవలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసినందున ముందు కూడా మనం అదే సమన్వయంతో ఉండాలన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలా కాకుండా సమస్యలు సృష్టిస్తే పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో 2023–24 సంవత్సరంలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మార్కులు సాధించిన మండలంలోని 24 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు స్టేట్ వైసీపీ ఐటీవింగ్ జనరల్ సెక్రటరీ, వైజీఆర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఉన్నత పాఠశాలల విద్యార్థులు తప్పక హాజరై నగదు ప్రోత్సాహకాలు అందుకోవాలని ఆయన కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు వంటి ఒళ్లునొప్పులకు చికిత్స అందిస్తారన్నారు.

అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య చికిత్సలు అందిస్తారని, ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మల్చింగ్ విధానం రైతులకు ఎంతో ఉపయోగం



మల్చింగ్ విధానంతో సాగులో ఉన్న పంట

పులివెందుల రూరల్ : మల్చింగ్ విధానం రైతులకు ఎంతో ఉపయోగమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ సరికొత్త ప్రయోగం ద్వారా ఆశించిన స్థాయిలో లాభాలు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో బిందు, తుంపర సేద్యాల తర్వాత మల్చింగ్ విధానం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంది. మొక్కచుట్టూ వ్యాపించి ఉన్న వేరు వ్యవస్థను ఏదైనా పదార్థంతో కప్పడాన్ని మల్చింగ్ విధానం అంటారు. కృత్రిమంగా తయారుచేసే ప్లాస్టిక్ షీట్ తోనూ మల్చింగ్ చేయవచ్చు. ఈ పద్ధతులతో భూమిలోని తేమను సంరక్షించడంతో పాటు కలుపు నివారణ, నేలకోతకు గురికాకుండా కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు. ఈ విధానంలో రసాయన ఎరువులు, సస్యరక్షణ అయ్యే ఖర్చులు 20 శాతానికి పైగా ఆదా చేసుకునే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. అలాగే ఉష్ణోగ్రతలు నియంత్రించడంతో పాటు నేల నిర్మాణాన్ని మల్చింగ్ విధానం మెరుగుపరుస్తుంది. 400 మీటర్ల కట్ట ఖరీదు రూ.1000ల నుంచి నాణ్యతను బట్టి రూ.2వేల వరకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మల్చింగ్ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వాలు వెసలుబాటు కల్పిస్తే బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాడీ ఫ్రీజర్ వాహనం ప్రారంభం



పులివెందులలో బాడీఫ్రీజర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మత పెద్దలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని బుల్లెట్ బాబు సేవలు వెలకట్టలేనివని అబ్దుల్ మౌలానా పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలో బుల్లెట్ బాబు తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బాడీ ఫ్రీజర్ వాహనాన్ని మత పెద్దలతో కలిసి ఆయన ప్రారంభించారు. బుల్లెట్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా ఎవరికైనా అంతిమయాత్ర కోసం వాహనంతో పాటు బాడీ ఫ్రీజర్‌ను వాడుకోవచ్చునన్నారు. ఈ వాహనాన్ని తీసుకెళ్లడానికి ఉచిత సేవా సహాయం కొరకు 9502788074, 8125990353 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకుడు నూరుల్లాహ తదితరులు పాల్గొన్నారు.

బీపీపై అవగాహన



ప్రజల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ హుస్సేన్ పీరా, ఎంపీహెచ్‌ఓ సుకుమార్‌లు

సింహాద్రిపురం : ప్రపంచ బీపీ దినం పురష్కరించుకుని శుక్రవారం బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గురిజాల గ్రామంలో బీపీపై డాక్టర్ హుస్సేన్‌పీరా, ఎంపీహెచ్‌ఓ సుకుమార్‌లు ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి ఆహార అలవాటులో సమయానికి తినకుండా ధూమపానం, నిద్రలేమి, అతిగా ఆలోచించడం, శారీరక శ్రమ లేకపోవడంతో బీపీ వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. బీపీ వచ్చిన వ్యక్తి డాక్టర్లను సంప్రదించి వారి సలహా మేరకు మందులు వాడాలన్నారు. అలాగే సదస్సుకు వచ్చిన వారికి బీపీ పరీక్షలు నిర్వహించి హైబీపీ ఉన్నవారిని ఆసుపత్రికి రావాలని సూచనలిచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం రమాదేవి, సీహెచ్‌ఓ లీల, ఆశాకార్యకర్తలు పద్మావతి, రాజారత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపురం : మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ చాంద్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 7 సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, అలాగే విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ కోత విధిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఆయన తెలిపారు.

టెన్షన్ పడకండలా..!

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఉరుకులు పరుగుల జీవితం. ఇంటా బయటా తట్టుకోలేని ఒత్తిడి. వేళాపాలా లేని తిండి. ఆగ్రహావేశాలు, నిరాశ, నిస్పృహ ఫలితంగా నరాల్లో పోటెత్తే వేగం అదుపుతప్పి రేకెత్తించే అలజడి. వైద్య పరిభాషలో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) అంటారు. బీపీ ఆదిలోనే అదుపులో పెట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. లేకుంటే పెను ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని సున్నితంగా హెచ్చరించారు.

మే 17న ప్రపంచ రక్త పోటు దినోత్సవాన్ని పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధి అయిన రక్తపోటుపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు. రక్తపోటు కలిగిన వారు వ్యాధిని నియంత్రణలో ఉంచుకుంటూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్ పి ఉపునిచ్చారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా శుక్రవారం అర్బన్ హెల్త్ ట్రైనింగ్‌సెంటర్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో శిక్షణ, ర్యాలీ, ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్ మాట్లాడుతూ ఈ ఏడాది రక్తపోటును నియంత్రించి దీర్ఘకాలం జీవించండి అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తెస్తున్నా మని తెలిపారు. రక్తపోటు బాధితులు నిరంతరం మందులు వాడుతూ అదుపులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రసన్నలత మాట్లాడుతూ రక్తపోటు అంటువ్యాధి కాదన్నారు.

ఓటింగ్‌లోనూ ఆధిక్యత చాటుకున్న మహిళలు

– 251 బూత్‌లుండగా 185 బూత్‌లలో మహిళలదే పై చేయి

కమలాపురం : నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో పాటు ఓటింగ్‌లోనూ మహిళలే ఆధిక్యత చాటుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 99,851 మంది పురుష ఓటర్లు ఉండగా 1,04,284 మహిళా ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 83,861 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 88,528 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

185 బూత్‌లలో ఆధిక్యత :
కమలాపురం నియోజకవర్గలోని ఆరు మండలాల్లో 251 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అయితే 185 బూత్‌ల్లో మహిళ ఓట్లే అధికంగా ఉన్నాయి. మిగిలిన 66 బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కమలాపురంలో 7 బూత్‌ల్లో, చెన్నూరులో 10 బూత్‌ల్లో, వల్లూరులో 9 బూత్‌ల్లో, వీఎన్‌పల్లెలో 6 బూత్‌ల్లో, పెండ్లిమర్రిలో 20 బూత్‌ల్లో, సీకేదిన్నెలో 14 బూత్‌ల్లో పురుషుల అధికంగా ఓటు వినియోగించుకున్నారు. మిగిలిన 185 బూత్‌ల్లో మహిళా ఓటర్లదే పై చేయిగా నిలిచింది.

పురుష ఓటర్లు అధికంగా ఉన్న బూత్‌ల వివరాలు :



ఓటు వేసేందుకు క్యూలో నిలిచిన మహిళా ఓటర్లు(ఫైల్)

కమలాపురం మండలంలోని జె.కొత్తపల్లె(బూత్ నెం.38), జంభాపురం(39), ఎర్రగుడిపాడు(40), అప్పారావుపల్లె(49) దేవరాజుపల్లె(52), ఎల్లారెడ్డిపల్లె(53), దాదిరెడ్డిపల్లె(56) బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు వేశారు.

చెన్నూరు మండలంలో శివాల్‌పల్లె(60), చెన్నూరు పట్టణంలోని 64, 68, 70, 71, 75 బూత్‌లు, బయనపల్లె (80), ముండ్లపల్లె(88), చిన్నమాచుపల్లె(93). వల్లూరు మండలంలోని లేబాక (101), పైడికాల్వ(104, 105), కొప్పోలు (108), సి.కొత్తపల్లె(112), గోటూరు (115), టీ.జీ.పల్లె(116), అంబవరం(117), ఆదినిమ్మాయపల్లె(123) బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీఎన్‌పల్లె మండలంలో యు.వెంకటాపురం(131), కొత్తపల్లె (138), వీఎన్‌పల్లె(142), యు.రాజుపాళెం(145), గోనుమాకులపల్లె(146), ఎస్.పాలగిరి(151), తంగేడుపల్లె (154) బూత్‌ల్లో పురుషుల అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెండ్లిమర్రి మండలంలో మమ్ముసిద్ధుపల్లె(156), మొయిళ్లకాల్వ(158), యారాసుపల్లె(16), ఎం.కొత్తపేట(162), చౌటపల్లె(163), నందిమండలం (164), నల్లయ్యగారిపల్లె (175), కొండూరు (176, 177), తుమ్మలూరు (179, 180), చీమలపెంట(182), పెండ్లిమర్రి(184, 185, 186), పగడాలపల్లె(187), పాతసంగటిపల్లె(188, 189), వెల్లటూరు(190), గంగపనల్లె ఎస్సీ కాలనీ(196) బూత్‌ల్లో పురుషులు అధికంగా ఓటు వేశారు. మిగిలిన బూత్‌ల్లో మహిళలదే పై చేయి. సీకేదిన్నె మండలంలో బాలుపల్లె(200), ఆజాద్ నగర్(206), పడిగెలపల్లె (207, రసూల్‌పల్లె (208), గోపులాపురం(209), బుసిరెడ్డిపల్లె(210), అప్పరాజుపల్లె(211), సుగాలి తండా (215), ఇప్పెంట(218), పబ్బాపురం(224), తాడిగొట్ల(230), ఉరుటూరు (233),మామిళ్లపల్లె(240)బూత్‌లు మినహాయించి మిగిలన బూత్‌లలో మహిళలు అధికంగా ఓటు వేశారు.

55,151 బూత్‌లలో పురుషులు–మహిళలు సమానం :
కమలాపురం మండలంలోని 55వ బూత్‌లో మహిళలు, పురుషులు సమానంగా ఓటు వేశారు. 147 మంది మహిళలు, 147 మంది పురుషులు ఓటు వేశారు. అలాగే వీఎన్‌పల్లె మండలంలోని 151 బూత్ ఎస్.పాలగిరిలో 291 మంది మహిళలు ఓటు వేయగా పురుషులు కూడా 291 మంది ఓటు వేసినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి.